


ఒక ఊరిలో ఒక చెరువుంది. ఆ చెరువులో నీళ్ళు ఉన్నాయి. ఆ నీటిలో చేపలు ఉన్నాయి. ఎండలకు చెరువు ఎండిపోయి నీళ్ళు ఇంకిపోయాయి. అలా ఇంకిన మడుగులో ఒక పిత్తపరిగి ఉండిపోయింది. అప్పుడు మేతకు వెళ్ళిన గేదె మడుగులో కాలు వేస్తే - ఆ కాలి డొప్ప అచ్చులో కొంచెం నీళ్ళు చేరాయి. ఆ నీటిలో పిత్తపరిగి ఉన్నాది, ఎలా ఉన్నాది? మామూలుగా కాదు,

కడుపు తోటి ఉన్నాది పిత్తపరిగి!

కథా నిలయం
5.3.11
శ్రీకాకుళం


అయితే, ఆ నీళ్ళు ఎప్పుడు ఎండిపోతే అప్పుడు తినేస్తానని కొంగ చూస్తోంది.


'కొంగయి నేస్తమూ... కొంగయి నేస్తమూ నన్ను తినకు. నా కడుపులో బిడ్డలున్నారు. మరి నేను గాని ప్రసవమయిపోయి పిల్లల్ని కనేసిన తరువాత నువ్వు తప్పకుండా తినెయ్యి' అన్నాది, ఎవరూ? ఈ కడుపుతో ఉన్న పిత్తపరిగి!

'లేదు లేదు' అన్నాది కొంగ.

'నా మాట విను, నన్ను నమ్ము. నన్ను తీసుకెళ్ళి నీళ్ళున్న చెరువులో పడెయ్యి' అని కొంగని బతిమలాడింది పిత్తపరిగి.

'లేదు... లేదు.. నువ్వు మాట తప్పిపోతావు. మరి నాకు దొరకవు. నాకు ఇప్పుడు ఆకలి వేస్తోంది. నేను నిన్ను తినేస్తాను' అన్నాది కొంగ.






'అలాగే తినేద్దువుగాని గానీ, నా కడుపులో ఉన్న బిడ్డల మొుకం చూసయినా నన్నొదులు' అనీసి బతిమలాడుకుంది పరిగి. ఎంత చెప్పినా కొంగ వినలేదు.

'లేదు కొంగయి నేస్తం... నా కడుపులో ఉన్నది మామూలు బిడ్డలు కాదు' అని కూడా చెప్పింది పిత్తపరిగి!

'సరే చెప్పిందేదో చూసేద్దాం' అనేసి కొంగ ఆలోచన చేసింది. 'దీన్ని తింటే ఎంత? తినకపోతే ఎంత? కడుపు నిండి పోతాదా? అందులోనూ విచిత్రమైన బిడ్డలు కడుపులో ఉన్నాయంటోంది కదా?!' అనుకొని కొంగ ఏం చేసిందీ?, ఈ పిత్తపరిగిని నోటితో పట్టుకుంది. పట్టుకొని తీసుకువెళ్ళి నీళ్ళు



ఉన్న చెరువులో పడేసింది. పడేస్తే ఆ పిత్తపరిగి ఒడ్డుకు వచ్చింది. ఒడ్డుకు వచ్చిన పిత్తపరిగి ముందు పులి పిల్లని కన్నాదట. ఆ తరువాత ఎలుగుబంటి పిల్ల పుట్టిందట. ఆ వెనుక పాము పిల్ల పుట్టిందట. ఆ వెనుక ఎద్దు పుట్టిందట. ఆఖరున నరుడు చిన్నవాడు పుట్టినాడట.


అయితే, అయిదుగుర్ని కన్న పిత్తపరిగి ముందు పులి దగ్గరకు వెళ్ళింది. వెళ్ళి, 'నాయనా... తమ్ముడ్ని నువ్వు పెంచుతావా? తమ్ముడు నిన్ను పెంచుతాడా?' అని అడిగింది.

'అమ్మా తమ్ముడ్ని నేను పెంచొచ్చు. నన్ను తమ్ముడు పెంచొచ్చు. నేను కొండలు, అడవులూ అన్నీ తిరిగొచ్చి... ఆ ఆకలి కోపంతో తమ్ముడ్ని ఏం చేస్తానో నాకు తెలీదు' అనేసింది. ఎవరూ? పులి!

అప్పుడు ఎలుగుబంటిని అడిగింది పిత్తపరిగి.

'నాయనా... తమ్ముడ్ని నువ్వు పెంచుతావా? నిన్ను తమ్ముడు పెంచుతాడా'?

'అమ్మా తమ్ముడ్ని నేను పెంచొచ్చు. నన్ను తమ్ముడు పెంచొచ్చు. నేను పుట్టలన్నీ దవ్వుకొని పుట్టకూడు తినుకోని ఉంటాను. పుట్టకూడు దొరకకపోతే ఆ ఆకలి కోపంతో తమ్ముడ్ని ఏం చేస్తానో నాకు తెలీదు' అనేసింది. ఎవరూ? ఎలుగుబంటి!



అప్పుడు పాముని అడిగింది పిత్తపరిగి.


'అవునమ్మా పామూ... తమ్ముడ్ని నువ్వు పెంచుతావా? నిన్ను తమ్ముడు పెంచుతాడా?'

'అమ్మా... తమ్ముడ్ని నేను పెంచొచ్చు. నన్ను తమ్ముడు పెంచొచ్చు. నేను కోరుపుట్టలన్నీ తిరుగుకొని ఆహారం దొరక్కపోతే ఆ ఆకలి కోపంతో తమ్ముడ్ని కాటేస్తే ఏమైపోతాడో నాకు తెలీదు' అనేసింది. ఎవరూ? పాము!

అప్పుడు ఎద్దుని అడిగింది పిత్తపరిగి.

'నాయినా... తమ్ముడ్ని నువ్వు పెంచుతావా? నిన్ను తమ్ముడు పెంచుతాడా?'

'అమ్మా... తమ్ముడ్ని నేను పెంచొచ్చు. నన్ను తమ్ముడు




పెంచొచ్చును. మా ఇద్దరికి మరెక్కడ దిక్కు? నేను తమ్ముడ్ని వదలను. నన్ను తమ్ముడు వదలడు' అని చెప్పింది. ఎవరూ? ఎద్దు!


ఆ తల్లి పిత్తపరిగికి సంతోషమయిపోయింది.

'ఎట్టి పరిస్థితుల్లోనూ తమ్ముడు జాగ్రత్త...' అని కడుపున పుట్టిన నలుగురిచేతా ఒట్టు వేయించిందట- 'తమ్ముడికి ఏ హాని కలిగించవద్దు' అని.

అప్పుడు పిత్తపరిగి ఒడ్డు మీదకు వచ్చింది. కొంగకి చెప్పింది. 'మాట తప్పక వచ్చినాను, ఇక నన్ను తినెయ్యి' అన్నదట పిత్తపరిగి.

'మాట నిలుపుకున్నావు, నిన్నెలగ నేను తింటాను?' అనేసి కొంగ ఏం చేసిందీ? తీసుకువెళ్ళి నిండుగా నీళ్ళున్న





చెరువులో పడేసింది. ఎవర్నీ? ఇంకెవర్ని పిత్తపరిగిని!

అది ఇక ఏమయ్యిందో?-

ఈ పులి ఇంతా అంతా అయ్యి అడివిలోకి వెళ్ళిపోయింది, కొండలకి. ఈ ఎలుగుబంటీ ఇంతా అంతా అయ్యి ఇదీ తోటలకీ అడవులకీ వెళ్ళిపోయింది. ఈ పామూ ఇంతా అంతా అయ్యి అదీ పుట్టల్లోకి తోటల్లోకి

వెళ్ళిపోయింది.

ఇక, ఈ పిల్లవాడూ ఎద్దూ మిగిలిపోయినారు.


ఆ ఎద్దేమో పిల్లాడ్ని ముత్యంలా చూసుకొని- దిగువన దించకుండా మీద కూచోబెట్టుకొని - అలాగలాగ - ఆ పండూ ఈ కాయూ అన్నీ తెచ్చి పిల్లవాడికి తినిపించి - ఇంత పిల్లవాడిని అంత పిల్లవాడిని చేసింది.

ఇంతా అంతా పదహారేళ్ళ వయసు వాడయినాడు.


ఎద్దు మీద కూర్చొని... ఆ ఎద్దు ఎలా వెళిపోతుంటే అలా వెళ్ళిపోవడమే. అలా వెళ్తూ ఉంటే చేతికందిన పండూ ఫలమూ దొరికినది తినడమే. అలాగ వెళిపోతోందట కాలము...

అలాగ వెళ్ళగా వెళ్ళగా వెళ్ళగా-

అడవులూ.. అగంతరాలూ - కొండలూ... కొనగిరులూ దాటుకుంటూ







వెళిపోతోంది ఎద్దు. ఆ పిల్లాడ్ని తీసుకొని.

అలా వెళ్ళగా వెళ్ళగా వెళ్ళగా-

ఒక కోనేరు వచ్చింది. ఆ కోనేటికి దేవేందురుడి కూతుర్లు దేవకన్యకలొచ్చి తానమాడోలట. ఆ అడవిలో ఆ కోనేటిలో జలకాలు ఆడోలట. జలకాలాడితే ఏమయ్యిందీ? ఈ చిన్నవాడు చూసాడు. చూసి 'అన్నా... అన్నా... ఆ పిల్లలు చూడు ఎంత అందంగా ఉన్నారో? ఏడుగురు అక్కాచెల్లెళ్ళు ఎంత బాగున్నారో చూసావా?' అన్నాడు.


'నాయినా... ఆలతో మనకెందుకు? ఏటి? ఆలు దేవకన్యకలు. ఆల ఊసు పట్టకు. జోలికెళ్ళకు. అసలు ఆలకంట పడకు' అన్నాది ఎద్దు.

ఆ దేవకన్యకలే చూసారట వీళ్ళను.

'అక్కంటే చెల్లీ - చెల్లంటే అక్కా' అనుకొని, 'చూసావా ఆ ఎద్దుని? ఏమిటా అందము? పశువుల్లో ఇంత పసిడిఛాయ ఎప్పుడూ ఎక్కడా చూడలేదు. దేవలోకంలో కూడా చూడలేదు. అది ఎద్దా లేక పోతే పొద్దా?' అని కళ్ళు చిట్లించినారు.

అందులో అందరికంటే చిన్నదాయి అన్నాది. 'ఆ ఎద్దుని ఏం చూస్తారే, ఆ ఎద్దు పక్కనున్న చిన్నవాడ్ని చూడండే... ఎలాగ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడో' అనేసరికి-

'అవునే... మనము ఎలాగయినా సరే, ఆ చిన్నవాడిని బోల్తాకొట్టించేసి ఎద్దుని తీసుకొని దేవలోకం వెళిపోదాం' అని అనుకున్నారు. ఎవరూ? అక్కా చెల్లెళ్ళయిన



దేవకన్యకలు.


అప్పుడు పిలిచినారు 'ఏ చిన్నవాడా రా... రా' అని.

'ఏమి?'

'మనము పందెము వేసుకు ఆడుకుందాము' అన్నారు అక్కాచెల్లెళ్ళు.

'ఏమిటా పందెము?'

'మరి మాకు ముట్టుకోగలవా?' అని అడిగారు అక్కాచెల్లెళ్ళు.



'ఉండండి... మా అన్నను అడిగి వస్తాను' అనుకొని వెళ్ళి ఎద్దుని అడిగినాడు. 'అన్నా... అన్నా... ఆ దేవకన్యకలు పందెము వెయ్యమంటున్నారు. నన్ను ముట్టుకోమంటున్నారు...'


'అయితే ఏమిటా పందెము?'

'మాకుగాని ముట్టుకుంటే... మా ఏడుగుర్లో ఎవర్ని ముట్టుకున్నా గాని మా కడసారి చెల్లెల్ని ఇచ్చి పెళ్ళి చేస్తాము. నువ్వు మమ్మల్ని ముట్టుకోలేకపోతే మీ ఎద్దుని మాకు ఇచ్చెయ్యాలి...'

పందెమంటే పందెమని అనుకున్నారు.

అయితే ఉండండని ఈ చిన్నవాడు వాళ్ళ అన్న దగ్గరకొచ్చి అడిగినాడు. 'సరే, అలాగే కానీ' అన్నాది ఎద్దు. అన్నాక, 'చూసినావా... ఆ కొలనులో వరుసగా ఏడు కలువ పువ్వులున్నాయి. వాటిని మొదళ్ళతోటి లాగెయ్యి... అక్కాచెల్లెళ్ళు ఏడుగురూ ఏడు కప్పలయి ఉంటారు. కలువ కాడలకి పట్టుకొని ఉంటారు. నువ్వు మాత్రం జలగవయిపోయి... నేను నీళ్ళుతాగటానికి వస్తాను కదా?, నా డెక్కలో దూరిపోయి దాక్కో...' అని చెప్పింది ఎద్దు.

పందెం ఒప్పుకున్న తర్వాత మానేద్దాం అంటే అవుతుందా? అవదు!
అప్పుడేమయ్యిందీ?
ఈ చిన్నవాడు వెళ్ళినాడు. కొలనులో దిగినాడు. అప్పటికే ఈ ఏడుగురు అక్కాచెల్లెళ్ళు కప్పలయిపోయి వరుసగా ఏడు కలువ కాడలకి పట్టుకున్నారు కదా?, ఈ చిన్నవాడు దిగి... ఆ ఏడు కలువ కాడలూ తీసి ఒడ్డు మీద పడేసినాడు.
'శెబాష్... చిన్నవాడా... నిన్ను మెచ్చినాము... ధన్యుడవేని...' అని అన్నారు దేవకన్యకలు. తరువాత పందెం ప్రకారం చిన్నవాడు నీట్లో మునిగినాడు. ఈ దేవకన్యకలు దీమాగా ఉన్నారు.
ఇంతలో - ఈ ఎద్దట ఏం చేసిందీ? నీళ్ళు తాగినట్టు కొలనులో నోరు పెట్టింది. కాళ్ళు నీట్లోకి దింపింది. ఈ చిన్నవాడు నీట్లో మునిగినాడు కదా, జలగయి వచ్చి ఎద్దు కాలి డెక్కలో దాక్కున్నాడు. ఈ దేవకన్యకలు వెతికి వెతికి అలిసిపోయినారు. నీరంతా బురద



బురద అంబలయిపోయింది. అయినా ఎక్కడా అగుపించలేదు చిన్నవాడు. అప్పుడు అక్కాచెల్లెళ్ళు చేతులు ఎత్తేసి 'చిన్నవాడా... ఓడిపోయినాము. నువ్వు కోరినట్టు మా కడసారి చెల్లెల్ని ఇచ్చి నీకు పెళ్ళి చేస్తాము' అన్నారు.

అయితే, ఈ ఎద్దు బురద నీరు ఏం తాగుతుంది? తాగినట్లుగా నోరు పెట్టి, కాళ్ళు నీట్లో పెట్టింది. కాలి డెక్క నుంచి బయటకొచ్చిన చిన్నవాడు కొలను మధ్యలో ఉన్న స్తంభం దగ్గర లేచి తేలియాడాడు!?

అప్పుడు- మాట ప్రకారం ఈ దేవకన్యకలు ఆ చిన్నవాడినీ ఎద్దునీ తీసుకొని దేవలోకం వెళ్ళారట. ఇలగిలగ మాట ఇచ్చాము అని తండ్రికి వృత్తాంతమంతా చెప్పేరట.

దేవేందురుడు చూసాడు. చిన్నవాడిని చూస్తే వన్నె వున్న వాడిలా కనిపించాడు. ఎద్దు చూస్తే అందుకు తగినట్టే ఉన్నాది అనుకున్నాడు. 'సరే, చిన్నదానికీ ఇష్టమే'నని గ్రహించి చిన్నవాడికిచ్చి పెళ్ళి చేసాడు. కొన్నాళ్ళు ఉంచినాడు. ఆ తరువాత సారీ సీరీ... ఏనుగులూ లొట్టిపిట్టికలు... ఒకటేమిటి సకలమూ ఇచ్చి భూలోకము పంపినాడు.

చిన్నవాడు అన్న ఎద్దుని తనతోనే తెచ్చుకున్నాడు. భూలోకం చేరినారు. చేరి ఒక పట్నం బయట దిగి ...డేరా కట్టి ... ఆ డేరాలో ఉన్నారు. అలా ఉండగా ఉండగా-

ఒక రోజునట చిన్నవాడికి గెడ్డం మాసిపోయింది. మంగలోణ్ని



పిలిచినాడు.


ఈ చిన్నవాడు భార్యని 'కొద్దిగ నీళ్ళు తేయే, మంత్రొచ్చాడు, గెడ్డాం గీస్తాడు' అని కేక వేసినాడు.

గెడ్డానికి నీళ్ళు తెరలోంచి ఇచ్చింది. చిటికెన వేలిగోరు కనబడాది. ఎవరిది? దేవకన్యకది! మంత్రికట కళ్ళు ఝుమ్మని తిరిగి పోయినాయి. జిగాల్మని పడిపోయినాడు.

'ఏమిరా మంత్రి అలగ పడిపోయావూ?' అని అడిగితే-

'ఏమిటో బాబు ఈమధ్య నాకు తల తిరుగుతోంది' అని మంత్రి అనేసినాడు. గబగబా గీసినట్టూ గియ్యనట్టూ గీసేసి పారిపోయినాడు. ఎక్కడికి? రాజుగారు దగ్గరికి వెళ్ళినాడు.

'రాజుగారండీ... రాజు గారండీ...'



'ఏవిఁరా మంత్రీ...'

'మహాప్రభూ... ఎవరో ఊరవతల డేరా కట్టుకొని ఉన్నారు. చిన్నవాడు చూస్తే మహారాజులా ఉన్నాడు. ఆల ఆవిడ ఉన్నాది బాబూ... తెరలోంచి గెడ్డాంకని నీళ్ళిస్తే చిటికెన వేలిగోరు

కనబడి కళ్ళు తిరిగి పడిపోయినాను. అలాటి అందగత్తె మీకు ఉంటే బాగు గాని, ఆ కుర్రోడికెందుకు?' అన్నాడు మంత్రి.

'అది మనకెలాగొస్తుందిరా' అన్నాడు రాజు.


'ఊరుకోయండి బాబూ... ఉపాయం లేనోళ్ళు ఊర్లో ఉండడానికి లేదు, ఆ మాత్రం ఉపాయము మనకి లేదా? మనం ఆలని ఊర్లోనికి రమ్మని అందాము. ఏదో ఉద్యోగము ఇద్దాము... మాట్లాడుదాము' అనేసి అన్నాడు పొది పట్టుకున మంత్రి.

'అయితే, పిలురయితే' అన్నాడు రాజు.

పొది పట్టుకొని వెళ్ళినాడు మంత్రి.

'చిన్నవాడా చిన్నవాడా... మిమ్మల్ని రాజుగారెందుకో రమ్మంటున్నారు, అవునూ మీరు ఏం చేస్తున్నారు? మీ వృత్తేమిటి? ఉద్యోగమేమిటి?' అని మంత్రి అడిగితే-

'మీ రాజుగారి దగ్గర కొలువు దొరికితే చెయ్యాలి' అన్నాడు చిన్నవాడు.



'అయితే పదండి బాబూ... మా రాజుగారు పిలుస్తున్నారు, మీకేదయినా పని నేనే ఇప్పిస్తాను... ఏమిటి? పూచీ నాది అని మంత్రి అంటే సరేనని బయల్దేరి వెళ్ళినాడు చిన్నవాడు.

ఎక్కడికి? ఇంకెక్కడికి?! రాజుగారి దగ్గరికి!!

మంత్రి రాజుగారికి చిన్నవాడి గురించి మనవి చేసాడు.

'ఏ ఊరు మీది?' అడిగాడు రాజు.

'ఏ ఊర్లో ఉంటే ఆ ఊరే మా ఊరు' అని అన్నాడు చిన్నవాడు.

'అయితే సరే గాని, మా రాజ్యంలో కొలువు ఇస్తాము చేస్తావా?' అని అడిగాడు రాజు.

'చిత్తం' అన్నాడు చిన్నవాడు.

'అయితే జీతమెంత?' మళ్ళీ అడిగాడు రాజు.

'మీదయ... కీలుకు వెయిరూపాయిలిస్తే చేస్తాను' అన్నాడు చిన్నవాడు. 'సరే, కీలుకు వెయి రూపాయలు ఇస్తాను, కాని నేను ఏపని చెప్పినా నువ్వు చెయ్యాలి' అన్నాడు రాజు.

'సరే చేస్తాను' అన్నాడు చిన్నవాడు.

అక్కడికో నెలా పదీ గడిచింది.


'ఏమిరా మంత్రీ... ఏమిటి సంగతి? చిన్న వాడ్ని అలాగే వుంచితే ఎంత తక్కువయిన కీలుకు వెయిరూపాయలు గదా! ఆ లెక్కన బోలెడు ధనమెల్లిపోతున్నాది. ఏమిటి చెయ్యడము? ఎలాగ?' అని రాజు అంటే-

'రాజా... దానికీ ఒక మార్గముంది. మన అమ్మగారికి బాగులేదని పులిపాలు తెమ్మని చెప్పి పంపిద్దాము. పులి పాలుకి పంపిస్తే, పులిపాలు ఆడు ఎప్పుడు తెస్తాడు? ఒక వేళ తేవాలని ప్రయత్నించినా పులులు వూరుకొని చూస్తాయా? కొట్టి చంపెస్తాయి. అప్పుడు అందాల భరిణె... అపరింజిబొమ్మ... ఆ అమ్మాయిని మీరు తెచ్చుకోవచ్చు' అన్నాడు మంత్రి.

అయితే ఇకన రాజుగారు చిన్నవాడ్ని పిలిపించినారు.

'... మరి చిన్నవాడా... ఏమిటి చెయ్యడం? మా రాణీ గారికి చాలా బాగోలేదు. తలబాధ. రాజ వైద్యులేమో పులిపాలు తెమ్మన్నారు. పులిపాలతో కలిపి మందిస్తే తగ్గుతుందన్నారు. మరి ఎవరూ ఈ రాజ్యంలో అంతటోళ్ళు లేరు. నువ్వెళ్ళి పులిపాలు పట్టుకొని

రాగలవా?'
రాజుగారు అడిగే సరికి 'సరే, అలగే తెస్తాను' అని అన్నాడు చిన్నవాడు. మరి మాట కొట్టలేడు కదా? ఏ పని చెప్పినా చేస్తానన్నాడు గదా, మరి... అందుకే ఒప్పందం మరి...
ఎలాగో ఏమిటో అనుకోని చిన్నవాడు ఇంటికి వెళ్ళినాడు. కాళ్ళు బుర్ర పెట్టుకుని కూర్చున్నాడు. ఆలావిడ వంటచేసింది. వంటచేసి ఉడుకు నీళ్ళు పెట్టింది. తాన్నం చెయ్యమన్నాది. ఏమి తాన్నం అన్నాడు. తినమంటే ఏమితినడంలే అన్నాడు. ఆకలి లేదని అన్నాడు.





ఎందుకలాగున్నారని భార్య అడిగింది. అడగదా?
'పులిపాలు తెమ్మని రాజుగారన్నారు. పులి పాలు ఎక్కడ దొరుకుతాయి? ఎలాగవుతుంది? ఎక్కడికి వెళ్ళగలను?' అని బాధపడ్డాడు చిన్నవాడు.
అయితే ఈ పిల్ల అన్నాది, ఏమని? 'మీ అన్నే పులని చెప్పినారు. ఇంక మీకేం భయం?' అని '.. మీ అన్నలు ముద్దుగా ఇచ్చిన ఉంగరం వున్నాది కదా?' అని గుర్తుచేసింది.
అవును, అప్పుడెప్పుడో అన్నదమ్ములందరూ కలిసి ఒక ఉంగరం చేయించారు. తమ గుర్తుగా చిన్నవాడి చేతికి తగిలించారు.
చిన్నవాడు ఉంగరం తడుముకొని చూసుకున్నాడు.
'పులి వచ్చినప్పుడు మీదగ్గర ఉంగరం వున్నాది కదా? అది తీసి విసిరితే సరి' అని చిన్నవాడికి చిటుకు చెప్పింది. దాంతో చిన్నవాడికి ధైర్యం వచ్చింది. అప్పుడు లెగిసి తాన్నం జేసి, ఉడుకుడుకుది ఇంత ముద్ద తిని బయలుదేరి పోనాడు. ఎక్కడికి? ఇంకెక్కడికి? కొండల్లోకి... కోనల్లోకి... వెళ్ళినాడు.


అడివిలోకి వెళ్ళేసరికి ఆ వేళ ఆహారము దొరక్క పులి నకనకనకలాడుతోంది. కొండమీద కూచోని పులి. ఎవరు దొరుకుతారా తినేస్తానని చూస్తోంది. చిన్నవాడు చూసి చూడకముందే నరవాసన నరవాసన అని నాలుగు దిక్కులు వెనికి చూసింది. వీడ్ని చిన్నవాడ్ని చూసింది. అన్నా... మనిషి వస్తున్నాడు అనేసి పసిగట్టింది. భగవంతుడు నాకీవేళ ఆహారము పెట్టాడని గబ్‌గబ్‌గబ కొండదిగింది. దిగివస్తుంటే... ఇలాగ ఉంగరం తీసి అలాగ పులిముందుకు విసిరాడు. విసిరేసరికి ఏటిపడ్డాదని పులి చూసింది.

ఉంగరం చూడ్డంతో 'అమ్మ... తమ్ముడా... చంపేసుందును. నేను గాగ నేనయినాను. మరి ఎవులయితే నిన్ను ఉంచుతారా? ఎంత పని చేసినావు? ఎందుకొచ్చినావు?' అని అడిగింది.

'అన్నా నీ దగ్గర పని ఉండి వచ్చాను. ఇలాగ నేను పలానా రాజు దగ్గర కొలువున్నాను, ఆ రాణిగారికి తల బాధట. పులి పాలు కావాలి. రాజ వైద్యులు మందు చెప్పారట. మరి పులి పాలు కోసం వచ్చాను' అని జరిగింది జరిగినట్టు చెప్పాడు చిన్నవాడు.

ఓరి తమ్ముడా దాని కోసం నీవొచ్చినావా? ఇప్పుడు పులి పాలు అంటే రెండు బరికెలు పులి పాలు తెచ్చి నీకు ఇవ్వగలను. కానీ ఏ రాయీ రప్పా తగిలి ఎక్కడ పడేస్తే... జల్లిపోనాయంటే మల్లొస్తే నేనుంటే పరావాలేదు. మరెవలుంటే నీకిస్తారా? పద మేమే వస్తాము' అని చెప్పి మందకు మంద పులులు - ఈ





మేకల మందయితే ఎలాగ ఎలిపొస్తాయే ఈ చిన్నవాడు ముందు నడుస్తుంటే అలాగ పులులు మందకు మంద చిన్నవాడి వెనకాల వచ్చేస్తున్నాయి. వాటిని తీసుకుని రాజ్యానికొస్తున్నాడు చిన్నవాడు.

ఇక్కడ - మంత్రి చిన్నవాడి ఇంటికి వెళ్ళాడు. 'అమ్మగారమ్మగారు మా రాజుగారు మిమ్మల్ని రమ్మని పిలుస్తున్నారు రాయండి' అని చెప్పినాడు.

'రాజుగారెందుకు పిలిచారు' అని అడిగి 'మా చిన్నవాడు వచ్చాక వస్తాను' అని చెప్పింది చిన్నది. 'అతను మరెక్కడ వస్తాడమ్మా పులిపాలుకెళితే పులులింక ఉంచుతాయా? ఎప్పుడో తినీసుంటాయి. మీరు రాయండి మా రాజుగారు పిలిచారు' అన్నాడు మంత్రి.

'వస్తాను పదయ్య... అతను చచ్చిపోతే నేనెక్కడ బతుకుతాను, నేనొస్తాను పద' అన్నది చిన్నది.

ఆమాటే రాజు దగ్గరకెళ్ళి చెప్పాడు మంత్రి.

'అయితే చూడరా... చిన్నవాడు వస్తున్నాడో లేదో...' అనీసి మేడెక్కి చూసేసరికి -


'బాబో... మేకల మందని తీసుకొచ్చినట్టు పులుల మందను తోలుకొస్తున్నాడు, ఆ పులులు ఊరుమీద పడితే ఊరిని ఉంచుతాయా? ఊర్చేస్తాయి' అని ఆశ్చర్యమైపోయినాడు మంత్రి.


'అయితే ఏటి చేయాలిరా?' అన్నాడు రాజు.

'పులికొక మేకనిస్తేగాని అవి మన ఊరినే ఊర్చేస్తాయి బాబూ...' అన్నాడు మంత్రి.

అప్పుడు రాజు 'ఒరే... ఎళ్ళురా గొల్లోల దగ్గరకి... మేకల మంద బేరమాడి తే' అన్నాడు.

అప్పుడు చిన్నవాడి దగ్గరకెళ్ళి 'పులిపాలు మాకొద్దు' అనేసి పులికొక మేకనిచ్చి తోలేసినారు.





అయితే మరి పులిపాలు కావాలన్నారేమి అనడిగితే -

'మరి మాకు పులుల్ని చూస్తే భయమేసింది. ఒద్దు నాయనా... ఏ పులిపాలు ఎవులు తీస్తారు దాని దగ్గరకెళ్ళి...' అని అనేసి రాజు తప్పించుకున్నాడు.

మళ్ళీ అక్కడికి పదిరోజులు ఐదురోజులు పోతే 'ఎలుగుబంటి పాలు కావాలి' అని అన్నారు. అలాగేననీసి చిన్నవాడు అడవికి వెళ్ళినాడు.

మళ్ళీ అలగే చేతి వేలి ఉంగరం తీసి విసిరినాడు. విసిరేసరికి ఎలుగుబంటి వచ్చి ఆ ఉంగరం అందుకున్నాది. అది చూసి ఎలుగుబంటి 'అరె తమ్ముడా నువ్వా? నువ్విలాగొచ్చావేటి?' అని అప్పుకప్పురమైపోయి అడిగింది.


ఇలక్కిలగ ఇలక్కిలగ జరిగింది అని చెప్పినాడు చిన్నవాడు.


'ఎంత మాటరా నేనవగా నేనయినాను. మరెవులైనా ఇలగే సేతువా? మరెవులైతే మీదపడి కొట్టీసి తినీరా? ఉస్తారా? ఎంత పని చేసినావు? పద పద' అనీసి 'పాలయితే నేనిచ్చేస్తాను నాయనా... ఏ రాయి రప్పా తగిలి పడేస్తే ...జల్లిపోయినాయంటే- మల్లొస్తే నేనయితే పరవాలేదు, మరెవులైతే నీకు ఉస్తారా? పద మేమే వస్తాము' పులి అన్నట్టుగానే ఎలుగుబంటి అన్నాది. ఇకన ఎలుగుబంట్లు మందకి మంద చిన్నవాడి వెనక నడిచొచ్చినాయి.

అలగే వచ్చి మంత్రి అడిగినాడు 'రా మా రాజుగారు పిలుస్తున్నారు' అని చిన్నదాన్ని పిలిచినాడు. 'వస్తాను పద...' అని అలాగే అనీసింది.

మేడెక్కి చూసినారు రాజు, మంత్రి- చూసేసరికి-

'బాబోయ్ ఏమిటవి? మందకి మంద ఎలుగుబంట్లు ఊర్లోకి వచ్చేస్తున్నాయి... ఏటి





చిన్నోడు, ఏటీ చిత్రము? ఇలాటోడేటి?' అనేసి ఆశ్చర్యమైపోయారు.

'అయితే ఏమిటి చెయ్యడం?'

అ ఎలుగుబంట్లకు పుట్టకూడు ఎక్కడ తెస్తారు. అందుకని అన్నం వండి పోసేస్తుంటే తినికెళిపోతున్నాయి బంట్లు. అలాగ ఇలాగ కాదు, కడుపునిండా తిన్నాయట. తిన్న తరువాత 'నాయనా ఆటికి తోలే' అంటే చిన్నవాడు ఆ బంటుల్ని తోలేసినాడు. అవి ఎలిపోయినాయి.

రాజు ఎందుకిలగ అనంటే మంత్రి పాత కతే పాడినాడు.

మళ్ళీ అలాగే- అక్కడికి నెలా పది పోనిచ్చి -

'పాము విషం కావాలి కాస్త తెచ్చిపెడతావా?' అని చిన్నవాడ్ని పురమాయించినాడు రాజు. రాణీ గారికి బాగోలేదు... రాజ వైద్యులు చెప్పినారు... అని పాత కతే పాడినాడు రాజు.

అలాగేననీసి చిన్నవాడు బయలెల్లినాడు.

అలగే ఉంగరం తీసి మళ్ళీ ఇలగే ముందరకి విసిరినాడు. పాము పుట్టలోనుంచి బయటకొచ్చి ఆహారం కోసం తిరుగుతూ ఈ ఉంగరాన్ని చూసి నిలబడిపోయింది.

'తమ్ముడా' అంటే 'అన్నా' అనుకున్నారు.

'ఏమిలాగ వచ్చినావు' అని అడిగితే వృత్తాంతమంతా చెప్పినాడు.

'నాయనా విషం అయితే నేను పిండేసి ఇచ్చేద్దును. నువ్వే రాయో రప్పో తన్నుకొని ఈ అడవిలో పడేస్తే మళ్ళీ నాకాడకొస్తే నాకాడ విషం ఉండదు. మరెందుకు మేమే వస్తాం పద' అని ఆ పాములు తోకలు, బుర్రలు ఎత్తీసుకుని, నడుములతోనే పాకిరీసుకుని ఎలిపొస్తన్నాయట... ఒక మందకి మంద.



ఇక్కడ చిన్నది 'వస్తానయ్యా వస్తాను... రాక నేనెక్కడికి వెళతాను, వస్తాను పద' అని మంత్రితో చెప్పింది. ఎవరూ? దేవేంద్రుడి కూతురు దేవకన్య. ఆవిడకి తెలీదా?

ఇకన- మేడెక్కి చూసేసరికి -

పాములు మరి నడుములే మోపుతున్నాయి. తోకలు మోపలేదు. బుర్రలూ మోపలేదు. ఇకన అమ్మా ఎలిపోస్తన్నాయి.

'అయితే ఏమిటి చేయడము?'

పాముకొక గుడ్డు లెక్క... ఎక్కడెక్కడ నెనికీసి ఊర్లోన ఉన్న గుడ్లన్నీ తెప్పించీసి... పాముకొక గుడ్డు ఇచ్చి తోలేసినారు.

అప్పుడు ఇంక ఏమీ చెయ్యలేక అలాగ వూరుకున్నారు. చిన్నవాడిని ఎక్కడికి తోలినా లాభం లేదని అనుకున్నారు.

ఇంతలోన -


పై దేశపు రాజు... ఎద్దుంది కదా.. ఆ ఎద్దుని చూసినాడు. 'ఆ ఎద్దుని ఎలాగైనా చిన్నోడి దగ్గర నుంచి తీసుకుపోవాలి' అనేసి ఎద్దుని బేరమాడ వచ్చినాడు.

అయితే, 'ఎద్దుని నేను అమ్మను' అనేసాడు చిన్నవాడు.

'లేదు... లేదు... మాకు అమ్మేయండి. ఎంత డబ్బు కావాలో చెప్పండి. పైసా కాదు పరకా కాదు, వెయి రూపాయలు ఇస్తాను' అన్నాడు రాజు. ఆడికేటి?

'వెయి కాదు, పదివేలు ఇచ్చినా ఇవ్వను' అన్నాడు చిన్నవాడు.





తమ్ముడికి పిలిచింది ఈ ఎద్దు. పిలిచి 'రా... వచ్చిన సొమ్ముని ఎందుకు వదులుకుంటావు'. ఇంటికొచ్చిన లక్ష్మిని కాలదన్నుకుంటావా? పరవాలేదు నన్ను ఆలకి అప్పగించు' అన్నాది ఎద్దు.

ఇవ్వనంటే ఇవ్వనన్నాడు చిన్నవాడు. నాకు చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసినావు, నేను ఇవ్వను అన్నాడు.

'రాజు కంట్లో పడ్డాను. నన్నెలగా నీ దగ్గర ఉంచడు, నేను చెపుతున్నాను కదా... నన్ను అమ్మీ వాడికి అదే మందు' అనేసి కళ్ళు తిప్పిందట ఎద్దు.

అన్న చెపుతున్నాడు కదా సరే అనుకొని ఎద్దుని రాజుకి అమ్మేసినాడు చిన్నవాడు. గొలుసులేసి కట్టినా, మంచి రేతిరపుడు ఎద్దు... అది ఎద్దయితే కదా... అదీ ఒక దివ్య పురుషుడు కాదా... ఆ ఎద్దేమో బయలుదేరి వచ్చేసింది. వచ్చి తమ్ముడి ఇంటి తలుపు కొట్టింది. తలుపు కొడితే తీసినాడు చిన్నవాడు.

అప్పుడు ఎద్దు అన్నాది 'నాకు ఎనకా ముందు చూడకుండా నడుముకి, ఏటి? నడుముకి రెండు ముక్కలు కొట్టేయ్...' అనేసరికి 'నేను కొట్టలేను తల్లి చిన్నప్పటి నుంచి అమ్మా, అయ్యా అయి పెంచినావు, నేను కొట్టను... ఇదేనా రుణం తీర్చుకోవడం?' అన్నాడు చిన్నవాడు.

వల్లకాదన్నాడు. మరేటి?

'లేదు నా మాట విను' అనేసి ఎన్నో ఒట్లు వేసేసి, మనసు విరిపేసి ఎద్దు అన్ని మాటలు ఆడేసింది.

ఆడేస్తే- సరేనని మరెందుకిన్ని ఒట్లు వేసిందో... ఆ ఎద్దుని అడ్డగా వెన్ను నడుముకి చేసి నరికేసినాడు.

నరికేసరికి-

ఎనక్కి ఏనుగు అయిపోయింది! ముందుకి గుర్రం అయిపోయింది!

ఆ పొద్దుట లెగిసి ఎద్దు కొన్న రాజు వచ్చినాడు 'బాబూ నీ దగ్గర కొన్న ఎద్దు నీకాడకి వచ్చిందా?' అని అడిగినారు.

'మా దగ్గరకి ఏటి రాలేదు, చూసుకోండి' అన్నాడు చిన్నవాడు.

ఆలు అన్ని దగ్గర్లా ఎతికి ఉసూరుమనుకొని ఎనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

అలాగ కొన్నాళ్ళకి... ఆ దేశపు రాజుకి ఒంట్లో

బాగులేకపోయింది. ఎవరికీ? చిన్నవాడికి కీలుకి వెయి రూపాయలిస్తున్న రాజుగారికి! రాజుకి మనోయాది లాగ అయిపోయింది. మంత్రి పురెక్కించినాడు కదా. మంచాన పట్టేసినాడు. ఒక పిల్లా లేదు. జెల్లా లేదు.

అప్పుడు ఆ దేశంలో... ఆ రాజ్యంలో ప్రజలందరూ ఏమిటి చేయడం అనుకొని, 'మాకు చిన్నవాడు రాజు అయితే బాగుంటాది' అని చిన్నవాడిని రాజుగా నిలబెట్టారు. అప్పుడు మాదేవి కూడా అలాగే అన్నాది. మాదేవి ఎవులూ? రాజుగారి భార్య. చిన్నవాడినే రాజుని చేయమందట.

ఎందుకూ?


ఎందుకంటే ఈడు పులుల్ని తోలుకురావడం... ఎలుగుబంటుల్ని తోలుకురావడం... పావుల్ని తోలుకురావడం... అన్నీ చూసినారు కదా ఊళ్ళో వాళ్ళున్నూ.

ఇకన, ఏటయిందీ?

'ఇలాంటోడే రాజుగా ఉండాలి. మన ఊరికి మేలవుతాది. అన్ని రకాలుగా... ఏ ఆపద వచ్చినా, సాపదొచ్చినా అడ్డుకున్నోడే రాజు' అని తేల్చినారు.

చిన్నవాడిని రాజుని చేసినారు. చిన్నది రాణి అయింది.





మరి ముసలిరాజు చచ్చినాడు.

కథా నిలయం
5303/11
శ్రీకాకుళం

చిన్నవాడికి పట్టాభిషేకం జరిపించినారు. జరిపించిన ప్రజలని బంటులాగుండి పాలించినాడు ఆ చిన్నవాడు.

పిత్తపరిగి కడుపున పుడితే ఏమి? ఎంత ప్రయోజకుడయినాడు?!

